# పరస్పర సహకారం




ఆ రోజు నా సైకిల్ చెడిపోవడం వల్ల, బాగుచేయించే టైములేక తప్పనిసరిగా బస్సులో బయలుదేరాను. అదే బస్సులో నా స్నేహితుడు నాగరాజు కూడా ఉన్నాడు. తన ప్రక్కనే నాకు చోటు చూపించాడు.

కండక్టర్, టికెట్లు ఇయ్యడం ఇంకా మొదలు పెట్టలేదు. అదే స్టార్టింగ్ పాయింట్. బస్ కదిలాక టిక్కెట్లు కొట్టడం మొదలు పెట్టాడు. కండక్టర్ వస్తున్నాడని డబ్బు చేతిలో పట్టుకున్నాను కనిపించేటట్లు. నాగరాజు కూడా పట్టుకున్నాడు.

"మీరు ఎక్కడికి వెళ్లాలి సార్?" అంటూ దగ్గరకి వచ్చాడు కండక్టర్.

"చాదర్‌ఘాట్!" అంటూ డబ్బు ఇయ్యబోయాను.

తలాడిస్తూ, టికెట్ కొట్టకుండానే ముందుకి వెళ్లాడు కండక్టర్.

మళ్లీ వెనదిరిగి వస్తూ నన్ను చూసి చిరునవ్వు నవ్వాడు. కాని, టికెట్ కొట్టకుండానే వెనకవైపుకి వెళ్లసాగాడు. మర్చిపోయాడో, లేక కొట్టాననుకున్నాడో... అనే ఉద్దేశంతో అతని భుజం తట్టి "ఏమండీ చాదర్‌ఘాట్‌కి టికెట్ ఇయ్యండి" అన్నారు.

అతను నా వంక ఎగాదిగా చూసి, నలభై అయిదు పైసలు తీసుకుని టిక్కెట్టు ఇచ్చాడు. నా నిజాయితీకి నేనే సంతోషిస్తూ కూర్చున్నాను.

నాగరాజు- డబ్బులైతే చేతిలో పట్టుకున్నాడు. కాని, టిక్కెట్టు కొనలేదు. కండక్టర్ అడగనూ లేదు.

మరికొంచెం సేపటికి చాదర్‌ఘాట్ వచ్చింది. అప్పటికి నాగరాజు టిక్కట్టు కొననే లేదు. ఇద్దరం బస్ దిగాం. దిగుతూ దిగుతూ, నాగరాజు కండక్టర్ చేతిలో పావలా బిళ్ల పెట్టాడు. కండక్టర్ కిమ్మనకుండా దానిని సంచిలో వేసుకున్నాడు.

ఇద్దరం బస్ దిగాం. "ఏమిటి నాగరాజూ... నువ్వు చేసిన పని?" అన్నాను.

"ఏముంది?" అన్నాడు అతను ఏమీ తెలియనట్లు.

"నువ్వు టిక్కెట్టు కొనలేదు. నలభై అయిదు పైసలు బదులు పావలా చేతిలో పెట్టావు" అన్నాను.

"అదా... అది మామూలే!" అన్నాడు నాగరాజు.

"అంటే?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఏముందీ? ఇరవై పైసలు నాకు లాభం!"

"కాని, ఆర్టీసీకి ఇరవై అయిదుపైసలు నష్టం... అవునా?" అన్నాను.

"మనం మడికట్టుకు కూర్చుంటే సరిపోతుందా? ఇలా ఎంతో మంది చేస్తారు. మరి, ఆర్టీసీ వాళ్ళు మాటిమాటికీ టికెట్ల రేట్ల పెంచుకుంటూ పోతూంటే ఏంచేస్తాం?!"

"అయినా... వాళ్ళు ఎంత పెంచినా చెల్లించేది మీరు కాదుగా... నిజాయితీగా టిక్కెట్లు కొనే నాలాంటి చేతకానివాళ్ళు!" అన్నాను నిష్ఠూరంగా.

నాగరాజు ఏమీ మాట్లాడలేదు.

అతను నాకు సన్నిహిత స్నేహితుడైనా, ఆ నిముషంలో ఒక దేశద్రోహిగా నా కళ్ల ముందు నిలిచాడు.

- యోజన పక్ష పత్రిక... 15-31 ఆగస్టు '77